## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కన్నెపల్లి, మే 21 : మండలంలోని మెట్‌పల్లి వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఉదయం కూర్మగూడెం శివారులో పెట్రోలింగ్ చేస్తుండగా పోలీసులను చూసి ట్రాక్టర్ డ్రైవర్ తప్పించుకోవడానికి చూడగా అతన్ని పట్టుకున్నామన్నారు. నిందితుడు వేమనపల్లి మండలం జిల్లెడకు చెందిన రాహుల్ అని అక్రమంగా మెట్‌పల్లి వాగు నుంచి జిల్లెడకు ఇసుక రవాణా చేస్తున్నాడని వెల్లడించాడన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

## ఆరోపణలు చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు

జైపూర్, మే 21: జైపూర్ తహసీల్ కార్యాలయంలో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న రెవెన్యు ఇన్‌స్పెక్టర్ తిరుపతి అవినీతికి పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు చేసి సోషల్‌మీడియాలో పోస్టులు, జిల్లా కేంద్రంలో ప్రెస్‌మీట్‌లు పెట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ టీఎన్‌జీవో నాయకులు బుధవారం జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేసిన మాదిగ దండోరా నాయకులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ నాయకులు ఏ సుమన్, సతీశ్, రవిచందర్, శ్రీనివాస్, లోకుల ప్రశాంత్, ఆరెల్లి సత్యనారాయణ, సురేశ్, ఉదయ్, కుమారస్వామి, అపర్ణదేవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు భాగ్యరెడ్డి వర్మ జయంతి

నస్పూర్, మే 21 : నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను గురువారం ఉదయం 9.30 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సంఘాల నాయకులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

I, KARAWADIA KISHOR KUMAR S/o. AMRUTHLAL PATEL R/o. H.No.4-2-345/1,Ranisatiji colony, Adilabad is hereby declare that, hence forth be known as **"KALAVADIYA KISHOR KUMAR"** as per my all Identification proofs. Hence declare.

**CHANGE OF NAME**

I, KARAWADIA REKHA PATEL W/o. KISHOR KUMAR, R/o. H.No.4-2-345/1,Ranisatiji colony, Adilabad is here by declare that, hence forth be known as **"KALAVADIYA REKHA"** as per my all Identification proofs. Hence declare.

**WANTED**

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## భూ సమస్య పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్, మే 21: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్‌లో 290 సర్వేనంబర్‌లో భూములు కొనుగోలు చేసి మోసపోయిన బాధితులు బుధవారం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే స్థలంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసిన వారంతా హనుమాన్ మాల వేసుకున్న స్వాములకు భిక్షను ఏర్పాటుచేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ తాము పైసాపైసా కూడబెట్టుకుని 20 ఏళ్లక్రితం ప్లాట్లను కొనుగోలు చేశామని, కొందరు భూకబ్జాదారులు వచ్చి తమ భూముల చుట్టూ కంచెవేసి కబ్జాచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమగోడును ఎవరూ పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం జరిగేలా చూడాలని పూజలు చేసినట్లు తెలిపారు.

## గల్ఫ్ కార్మికుడికి విరాళం

జన్నారం, మే 21 : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన గల్ఫ్‌కార్మికుడు దేవి ప్రభాకర్‌కు తెలంగాణ మండల గల్ఫ్ కార్మిక సంక్షేమ సమితి ఆధ్వర్యంలో రూ.22,600 వేలను విరాళంగా అందజేశారు. సౌది అరేబియాలో డ్రైవర్‌గా పనిచేస్తూ క్యాన్సర్ లక్షణాలు కనిపించడంతో స్వగ్రామానికి వచ్చి ప్రస్తుతం కరీంనగర్‌లో దవాఖానలో చికిత్సపొందుతున్నాడు. ప్రస్తుతం అతని కుటుంబానికి విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాంపూర్‌కు చెందిన గల్ఫ్ కార్మికులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు

రామకృష్ణాపూర్, మే 21: రామకృష్ణాపూర్ పరిధిలో గల బొక్కలగుట్ట గ్రామంలో రోడ్డు భద్రత కమిటీని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు రోడ్డు భద్రత కమిటీని పట్టణ ఎస్ఐ జీ. రాజశేఖర్, సిబ్బంది బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు రోడ్డు ప్రమాద నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దని, రాంగ్ రూట్‌లో వెళ్లకూడదని, త్రిబుల్ డ్రైవింగ్, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని తెలిపారు. గ్రామ పెద్దలు, యువకులు, వాహనదారులను కలిపి రోడ్డు భద్రత కమిటీ ఏర్పాటు చేసి అధ్యక్షుడిగా బలికొండ కిషన్‌ను నియమించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ సురేశ్, రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బెల్లంపల్లి, మే 21: తాపీ సంఘం సభ్యుడు, మేస్త్రీ దొరిశెట్టి తిరుపతికి పట్టణ తాపీ సంఘం చేయూతనందించింది. బుధవారం ఆయనకు రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. తిరుపతి గతేడాది నుంచి పక్షవాతంతో బాధపడుతూ పని చేయలేని స్థితిలో ఉండడంతో అతనికి రిటైర్మెంట్ స్కీం కింద సాయం చేసినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తాడిశెట్టి రాంకుమార్, ఉపాధ్యక్షుడు పంతంగి బిక్షపతి, ప్రధాన కార్యదర్శి యేలుగం శ్రీనివాస్, కోవాధికారి సుంకరి కృష్ణ, కార్యదర్శులు ఎంజుల కుమార్, మచ్చ శ్రీను, కార్యవర్గ సభ్యులు చంద్రయ్య, హనుమంతు, సుధాకర్, అంజయ్య పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైపులైన్‌ను పునరుద్ధరించాలి

బెల్లంపల్లి, మే 21: పట్టణంలోని 28వ వార్డులో సగంలో నిలిపివేసిన మిషన్ భగీరథ పైప్ లైన్‌ను పునరుద్ధరించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్, ఆరేపల్లి రమేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం సమర్పించారు. పైప్ లైన్ కోసం ఇష్టం వచ్చినట్లుగా తవ్వి వదిలేయడంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఆ బండ రాళ్లను తాకి గాయలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్కుల నిర్వహణను పట్టించుకోవాలన్నారు.

## సోలార్ ప్లాంట్ పనులు త్వరగా పూర్తి చేయాలి

మందమర్రి, మే 21: సింగరేణి మందమర్రి ఏరియాలో చేపట్టిన 67.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సింగరేణి డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణ రావు, సోలార్ ఎనర్జీ జీఎం జీఎస్.జానకిరామ్ ఆదేశించారు. ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జీఎం దేవేందర్ అధ్యక్షతన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 67.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఏరియాకు వచ్చిన సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ రావు, సోలార్ ఎనర్జీ జీఎం జానకీరామ్‌లను ఏరియా జీఎం దేవేందర్ అధికారులతో కలిసి సన్మానించారు. ఈ సమావేశంలో ఏరియా ఎస్టోటూ జీఎం విజయ్ ప్రసాద్, ఇంజినీర్ వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, కేకే గ్రూప్ ఏఎంట్ రాంబాబు, ఏరియా రక్షణాధికారి రవీందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, సివిల్ ఎస్ఈ రామకు, డీజీఎం ఎఫ్ అండ్ ఏ ఆర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్, ఫారెస్ట్ అధికారి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 18 మందికి కారుణ్య నియామక పత్రాలు

సీసీసీ నస్పూర్, మే 21: సింగరేణి ఉద్యోగాల్లోకి చేరబోతున్న యువ కార్మికులు సంస్థపై అంకితభావంతో పనిచేయాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ సూచించారు. బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశం మందిరంలో 18 మంది యువతీ, యువకులకు ఆయన కారుణ్య నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి కొమురయ్య, ఇందారం ఓసీపీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీవో కాంతారావు, జీఎం చర్చల కమిటీ సభ్యులు రాంచందర్, సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి

సీసీసీ నస్పూర్, మే 21: బొగ్గు పరిశ్రమలో పని చేసి ఉద్యోగ విరమణ పొందిన వారికి పింఛన్లు పెంచాలని ఆలిండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని న్యూఢిల్లీలో అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. అతి తక్కువ పింఛన్ వస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు ఆకలితో అలమటిస్తున్నారని, ఈ విషయంలో కేంద్ర మంత్రి జోక్యం చేసుకుని పింఛన్ల పెంపుదలకు కృషి చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రికి ఆలిండియా కోల్ పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు దండంరాజు రాంచందర్‌రావు, ఆళవందార్ వేణుమాధవ్ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో డాక్టర్ బీకే శ్రీవాస్తవ్, పీకే సింగ్ రాథోడ్ ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి హామీ

రెబ్బెన, మే 21: సింగరేణి కార్మికుల హక్కులు, పెండింగ్ సమస్యలను గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ యూనియన్ కు మధ్య బుధవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో జరిగిన స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. గోలేటిటౌన్‌షిప్‌నకు శుభ్రమైన తాగునీ, గోలేటిటౌన్‌షిప్ నుంచి గోలేటి క్రాస్ రోడ్ వరకు లైటింగ్, గోలేటి సీహెచ్‌పీ , ఏరియా వర్క్‌షాప్‌లో జనరల్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఇవ్వాలని, గోలేటి దవాఖానలో చల్లని తాగునీరు, మదారంటౌన్‌షిప్ లో రెండవ షిఫ్ట్‌లో ఎలక్ట్రిషియన్ అందుబాటులో ఉంచాలని కోరినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సింగరేణి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఖైర్‌గూడ పీవో మచ్చగిరి నరేందర్, పీఎం రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్‌బెహరా, డీజీఎం(సివిల్) మదీన బాషా, ఫైనాన్స్ ఆఫీసర్ రవికుమార్, సీహెచ్‌పీ ఎస్ఈ కోటయ్య, డీవైపీఎం వేణు, సీనీయర్ పర్సనల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఏఐటీయూసీ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, కమిటీ సభ్యులు జూపాక రాజేశ్, శేషు, మారిన వెంకటేశ్వర్లు, అనంద్, దేవేందర్, తదితరులున్నారు.

## వేతనాలు సకాలంలో చెల్లించాలని ధర్నా

మందమర్రి, మే 21: కార్మిక కాలనీల్లో ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లలో పని చేస్తున్న కార్మికులకు నిబంధనల మేరకు ప్రతి నెల 10న వేతనాలను చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రీజియన్ అధ్యక్షుడు ఎండీ.జాఫర్ డిమాండ్ చేశారు. మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ పట్టణాలలోని సులభ్ కాంప్లెక్స్‌లలో పని చేస్తున్న కార్మికులు తమకు వేతనాలను సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఏరియా జీఎం దేవేందర్‌కు వినతి పత్రం అందించారు.

# మీ సేవ కేంద్రం లేక తిప్పలు

- ఏ పని ఉన్నా ఆసిఫాబాద్, ఉట్నూర్, ఆదిలాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి
- స్థానికంగా ఏర్పాటు చేయాలని వినతి

జైనూర్‌లో మూసి ఉన్న మీ సేవ కేంద్రం

జైనూర్, మే 21 : రేషన్ కార్డులు దరఖాస్తులు, కుల ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ పథకాల కోసం ఆన్‌లైన్ చేయడం ఇలా ఏది పొందాలన్నా మీ సేవా కేంద్రానికి వెళ్లాల్సిందే. అలాంటిది జైనూర్ మండల కేంద్రంలో ఒక్క మీ సేవ కేంద్రం కూడా లేకపోవడంతో మండల ప్రజలతో పాటు పక్కనే ఉన్న సిర్పూర్ (యూ), లింగాపూర్ మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జైనూర్ మండల కేంద్రంలో ఒకే మీ సేవా కేంద్రం ఉండగా అది అధిక డబ్బులు వసూళ్లు చేస్తున్నారని, నిర్వహణ సరిగా లేదని ఆదివాసీ గిరిజన నాయకుల వినతి మేరకు మీ సేవా కేంద్రాన్ని కలెక్టర్ మూసివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక అప్పటి నుంచి మీ సేవా కేంద్రంలో ఏదైనా పని ఉంటే జైనూర్ మండల కేంద్రం నుంచి అటూ ఉట్నూర్, ఆదిలాబాద్ ఇటూ ఆసిఫాబాద్‌కి వెళ్లాల్సిన దుస్థితి నెలకొన్నది. స్థానికంగా ఓ మీ సేవ కేంద్రం ఏర్పాటు చేస్తే జైనూర్, సిర్పూర్ యూ, లింగాపూర్ 3 మండలాల ప్రజలకి ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

**3 మూడు మండలాలకు ప్రయోజనం..**

జైనూర్ మండలంలో ఓ మీ సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే జైనూర్, సిర్పూర్ యూ, లింగాపూర్ మూడు మండలాల ప్రజలకి ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సిర్పూర్ యూ, లింగాపూర్ మండలాల ప్రజలు అటు ఉట్నూర్, ఆదిలాబాద్ ఇటు ఆసిఫాబాద్ వెళ్లాలన్న జైనూర్ కి రావాల్సిందే కనుక రెండు మండలాలకి కేంద్రంగా ఉన్న జైనూర్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ప్రజలు దూర భారం తగ్గి సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయి.

### ఆదిలాబాద్‌కు వెళ్లాల్సి వస్తున్నది..

జైనూర్‌లో మీ సేవ కేంద్రం లేక తప్పనిసరి పరిస్థితుల్లో ఆదిలాబాద్ లేదా ఆసిఫాబాద్ వెళ్తున్నాం. అంత దూరం వెళ్లాలంటే ఇబ్బందిగా ఉన్నది. జైనూర్‌లోనే మీ సేవ కేంద్రం ఏర్పాటు చేస్తే దూర భారం తగ్గి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు త్వరగా స్పందించి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

-ఆత్రం జుగదిరావ్, గుడమామడ

### ఇబ్బందులు పడుతున్నాం..

స్థానికంగా మీ సేవ కేంద్రం లేక ఎంతో ఇబ్బంది పడుతున్నాం. అంత దూరం వెళ్లాలంటే ప్రయాణ చార్జీలు, సమయం వృథా అవుతుంది. జైనూర్‌లో మీ సేవ ఏర్పాటు చేస్తే ఏజెన్సీ ప్రాంతాల్లోని మూడు మండలాలకు ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులు, నిరుద్యోగులకు కావాల్సిన సర్టిఫికెట్ల కోసం ఇబ్బందిగా ఉంది. రేషన్ కార్డులో పేరు నమోదు చేయాల్సి ఉన్నది. ఉట్నూర్ వెళ్లాల్సిందే అక్కడ చాలా రద్దీగా ఉండడంతో రెండురోజులు పడుతున్నది.

-కుమ్ర మోతీరాం సుకుడ్‌పల్లి

# పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులే రథసారథులు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 21 : పాఠశాలల ప్రగతికి ప్రధానోపాధ్యాయులు రథసారథుల లాంటి వారని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండో విడుత వేసవి శిక్షణలో భాగంగా జిల్లా కేంద్రంలోని గర్ల్స్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి సత్యనారాయణమూర్తి, రీసోర్స్ పర్సన్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

**పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి**

జిల్లాలో ఈ నెల 25న జరగనున్న గ్రామ పరిపాలన అధికారుల పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార దీపక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో శ్రీనివాసరావుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25న జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని, ఉదయం 9.30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివాజీ, మండల తహసీల్దార్ రఫతుల్లా తదితరులు పాల్గొన్నారు.

**నూతన చట్టంలో తప్పల సవరణకు అవకాశం**

భీమారం, మే 21 నూతన చట్టంలో రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని, రిజిస్ట్రేషన్, ముటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి మ్యాప్ తయారు చేస్తామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. భీమారం మండలంలోని తహసీల్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ దవాఖాన నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేసేందుకు అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి గోనె సంచులు, టార్పాలిన్లను, తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ సౌకర్యాలు కల్పించాలని, ధాన్యం విక్రయించిన రైతులకు రసీదులు జారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వనజ రెడ్డి, భీమారం తహసీల్దార్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## పులి హతంపై కొనసాగుతున్న విచారణ

దహెగాం/పెంచికల్‌పేట, మే 21 : ఈ నెల 14న పెంచికల్‌పేట మండలం ఎల్లూరు అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చుకు పెద్ద పులి బలికాగా, అటవీశాఖ అధికారులు లోతైన విచారణ చేపడుతున్నారు. ఇప్పటికే దహెగాం, పెంచికల్‌పేట మండలాలకు చెందిన పలువురిని అదుపులోకి తీసుకోగా, ఇందులో ఐదుగురిని ప్రధాన సూత్రధారులుగా భావించి విచారిస్తున్నట్లు సమాచారం. సోమవారం దహెగాం మండలం చిన్నరాస్పల్లి గ్రామానికి చెందిన ఎల్కరి శేఖర్ ఇంటి ఆవరణలో పాతిపెట్టిన పులి గోర్లు, చర్మం, కాళ్లు, మీసాలు, తలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ కేసులో ఇంకా ఎవరిదైన హస్తముందా అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నారు. మంగళవారం రాత్రి శేఖర్ ఇంటికి చేరుకొని ఆయన భార్యను ప్రశ్నించినట్లు తెలిసింది. పులి చర్మానికి పూసిన పసుపు ఎక్కడిది అని ప్రశ్నించగా, ఇంటిలోని పుసుపునే తీసుకెళ్లినట్లు ఆమె చెప్పినట్లు తెలుస్తున్నది. కాగా, బుధవారం అధికారుల బృందం ఎల్లూరు అటవీ ప్రాంతంలో పులిని ఖననం చేసిన ప్రదేశాన్ని సందర్శించి మరిన్ని వివరాలు సేకరించినట్లు తెలుస్తుంది. కాగా, ఇప్పటికే ఎల్లూరుకు చెందిన ఇద్దరు, దహెగాం మండలం చిన్నరాస్పల్లికి చెందిన ముగ్గురు వేటగాళ్లు అధికారుల అదుపులో ఉండగా, పెంచికల్‌పేట మండలానికి చెందిన మరో 8 మందిని, దహెగాం మండలానికి చెందిన మరో ఏడుగురిని మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పులిని హత మార్చిన ఘటనలో రాజకీయాలతో సంబంధమున్న వ్యక్తులైనా సరే వదిలిపెట్ట బోమని వైల్డ్‌లైఫ్ సీసీఎఫ్ కేవీ సింగ్ నెహ్రూ అన్నట్లు సమాచారం.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 21 : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, మిషన్ భగీరథ, గృహ నిర్మాణ, గిరిజన సంక్షేమ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో ప్రభుత్వ అభివృద్ధి పనుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు దృష్టి సారించాలన్నారు.

**రుణ లక్ష్యాన్ని సాధించాలి**

బ్యాంకర్లు తమకు నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించే విధంగా సమన్వయంతో కృషి చేయాలని మంచిర్యాల కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో డీఆర్డీవో దత్తారావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, నాబార్డ్ మేనేజర్ వీరభద్రుడుతో కలిసి బ్యాంకర్లు, అధికారులతో నిర్వహించిన 4వ వార్షిక జిల్లాస్థాయి సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కాగజ్‌నగర్, మే 21: ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం హెచ్చరించారు. కాగజ్‌నగర్ పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఫర్టిలైజర్ షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. నకిలీ పత్తి విత్తనాలు, గ్లైసిల్(గడ్డి మందు) విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, పీడీ యాక్ట్ కూడా ఓపెన్ చేస్తామన్నారు. ఎవరైనా విక్రయించినట్లు తెలిస్తే సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రేంకుమార్, ఎస్ఐ సుధాకర్, ఫర్టిలైజర్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

## క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్‌లో కమిషనరేట్‌కు మూడో స్థానం

అవార్డు అందుకుంటున్న డీసీపీ ఎగ్గడి భాస్కర్

మంచిర్యాల అర్బన్, మే 21: క్యూఆర్ కోడ్ అండ్ సీఎఫ్‌సీ ద్వారా పోలీసు సేవలపై ప్రజల అభిప్రాయాల ఆధారంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డీజీపీ ఆదేశాల మేరకు టాప్ 10 యూనిట్లను ఎంపిక చేశారు. అందులో రామగుండం పోలీస్ కమిషనరేట్ మూడవ స్థానం లభించింది. ఈ అవార్డును బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో డీజీపీ జితేందర్ చేతుల మీదుగా రామగుండం కమిషనరేట్ తరుపున మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులను, సిబ్బందిని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. క్యూఆర్‌కోడ్ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో, ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద, సోషల్ మీడియా, పోలీస్ వెబ్ సైట్లల్లో అందుబాటులో ఉంటుందని, పోలీసుల పనితీరుపై అభిప్రాయాలను తెలుపవచ్చని తెలిపారు. ఎఫ్ఐఆర్, ఈ చలాన్ (ట్రాఫిక్ ఉల్లంఘనలు), పాస్ పోర్టు ధ్రువీకరణ, ఇతర అంశాలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని సీపీ తెలిపారు.

# టోల్ గేట్లను తొలగించాలి

- జాతీయ రహదారిపై బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

టోల్ గేట్‌ను తొలగించాలని కిష్టంపేట వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

చెన్నూర్ రూరల్, మే 21: చెన్నూర్ మండలంలోని కిష్టంపేటలోని జాతీయ రహదారిపై వై జంక్షన్ వద్ద ఫారెస్ట్ అధికారులుల ఏర్పాటు చేసిన టోల్ గేట్‌ను పూర్తిగా తొలగించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన టోల్ గేట్‌ను తొలగించాలని కోరుతూ.. బుధవారం బీజేపీ పార